www.aakshitha.com
People's voice
# అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శనివారం । 11 । ఏప్రిల్ । 2026



# కష్టాల్లో ఉన్నా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**కరీంనగర్, అక్షిత బ్యూరో :** రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులున్నప్పటికీ సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో ఆయన తిమ్మాపూర్ మండలానికి చెందిన143 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొనసాగుతున్నదని, ఆర్థికపరిస్థితిని కారణంగా చూపుతూ సంక్షేమ పథకాలను ఆపబోమని స్పష్టం చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆ పథకాలను కొనసాగిస్తూ ముందుకు వెళతామన్నారు. గతంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల కోసం ఎదురు చూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు 24విడుతల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామని, 24వ విడుతలో 143 మందికి 40.94 లక్షల రూపాయలు మంజూరు కాగా, వాటిని ఇప్పుడు చెక్కుల రూపేణా పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేశ్,

మిగతా.. 2లో

- పేదోళ్ళకు అండగా సర్కార్
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



# ప్రతిపక్షాల బురద రాజకీయం

**ఖమ్మం / అక్షిత బ్యూరో:** ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసిన భవిష్యత్తులో ఇందిరమ్మ ప్రభుత్వంని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 58.58 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలిన ఈ ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ధాన్యం

మిగతా.. 2లో



# రహదారి భద్రతతో ప్రమాదాలకు కళ్లెం

- జిల్లా కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, పోలీస్, రవాణా, రహదారి భవనాల, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, జాతీయ రహదారులు, విద్యా, వైద్య, ఆరోగ్యశాఖ, అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశానికి ఎస్. పి నీతికాపంత్,అదనప కలెక్టర్ ఏం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్ల ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారులు ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా వున్నా గ్రామాలలో నేషనల్ హైవే అధికారులు, లైటింగ్ ఏర్పాట్లు, సర్వీస్ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు రహదారులకు అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాలు, వేలాడే తీగలను సరి చేయాలన్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు రేడియం


మిగతా.. 2లో

# మహిళా సాధికారతే లక్ష్యం

- మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన
- ఐకేపీ కేంద్రాల్లో ధనాధన్ కొనుగోళ్లు
- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**పెద్ద అడిశర్లపల్లి, అక్షిత ప్రతినిధి:** పెద్ద అడిశర్లపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం గ్రామాలలో మౌలిక సదుపాయల కల్పనపై మండల స్థాయి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ నిర్వహించారు. వేసవి కాలానికి దృష్టిలో పెట్టుకొని గ్రామ ప్రజలకు త్రాగునీరు సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సూచించారు.గ్రామ పంచాయతీ లో ఉన్న బడ్జెట్ అత్యవసరాలకు మాత్రమే విని యోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శిలకు, సర్పంచులకు సూచించారు. 25 మంది లబ్దిదారులకు

మిగతా.. 2లో





# పేదల దరికి ప్రభుత్వ వైద్యం

- భారతీయ వైద్య విధానం ప్రపంచానికి ఆదర్శం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, అక్షిత బ్యూరో:** భారతీయ వైద్య విధానం ప్రపంచానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరానికి జిల్లా వైద్య

మిగతా.. 2లో

# కష్టాల్లో ఉన్నా సంక్షేమ పథకాలు

**మొదటి పేజీ తరువాయి..**

మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, మామిడి అనిల్ కుమార్, తమ్మనవేణి రమేశ్ యాదవ్, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, బుధారపు శ్రీనివాస్, తమ్మనవేణి రాములు యాదవ్,ఎల్క రాజు, రెడ్డి రాజు, పోలు రాము, రమేశ్, గోదారి తిరుపతి, పొన్నాల సంపత్, కసిరెడ్డి ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### "కాల్వను పరామర్శించిన కవ్వంపల్లి"

నగర పాలక సంస్థ పరిధిలోని 7వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ మల్లేశం ను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఇటీవల కాల్వ మల్లేశం సోదరుడు ఇంద్రసేన్ అనారోగ్యంతో మరణించగా శుక్రవారం అల్గునూరులోని ఆయన స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణానికి గల కారణాలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి అడిగి



తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.రమేశ్ యాదవ్, పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణ రెడ్డి, కంది పెద్ద అశోక్ రెడ్డి, కంది చిన్న అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు. "కాలభైరవుని ఎమ్మెల్యే ప్రత్యేక పూజ" కాళ అష్టమిని పురస్కరించుకొని తిమ్మాపూర్ మండలం అలుగునూరులోని శ్రీ కాలభైరవ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం ఈ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ పూజలో ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పేదల దరికి ప్రభుత్వ వైద్యం

**మొదటి పేజీ తరువాయి..**

ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రోగ్రాం అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచానికి భారతీయ వైద్య విధానం ఆదర్శంగా నిలిచిందని, ఎన్నో రకాల వైద్య పద్ధతుల ద్వారా వ్యాధులను నయం చేసే విధానాలను అవలంబించడం జరుగుతుందని తెలిపారు. భారతీయ వైద్య వ్యవస్థలో హోమియో, ఆయుర్వేదం, యునాని, యోగ వంటి అనేక పద్ధతులలో వ్యాధులను నయం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. కీళ్ల నొప్పులు, మధుమేహం, రక్త పటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను హోమియోపతి,



న్యాచురోపతి, యోగ వంటి విధానాల ద్వారా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆయుష్ వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అతి సాధారణ ఖర్చులతో ప్రకృతికి దగ్గరగా యోగ, ఫిజియోథెరపీ ద్వారా అందించే చికిత్సకు మంచి ఫలితాలు లభిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, గ్రామీణ స్థాయి నుండి పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, మన జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యులు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతతో ప్రమాదాలకు కళ్ళెం

**మొదటి పేజీ తరువాయి..**

అంటించాలన్నారు. రవాణా శాఖ, అధికారులు, వాహనాలను, స్కూల్ బస్సులను,తనిఖీలు చేపట్టాలన్నారు. రహదారి భవనాల శాఖ, పంచాయతి రాజ్, ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో గల రహదారులకు మరమ్మత్తులు, వంతెనల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రహదారులపై స్పీడ్ బ్రేకర్లు, వేగ నియంత్రణ, సూచిక బోర్డులు, ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని మునిసిపాలిటీలలో మండల కేంద్రాలలో వాహనాల రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి అతివేగంగా, హెల్మెట్, సీటు బెల్టు, ధరించని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. రహదారి నియమాలపై పజలకు అవగాహన పర్చాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో డి. ఆర్. డి. ఓ దత్తారావు, రవాణా శాఖ అధికారి రామచందర్,డి. పి. ఓ భిక్షపతి ,ఎస్ ఇ విద్యుతు శాఖ ఉత్తం జాడే, పిఆర్ ఇఇ ధర్మేందర్, విద్యా, వైద్య నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి..**

ఒక్కొక్కరికి 100116/- రూపాయల చొప్పున స్వయంగా పంపిణీ చేయడం జరిగింది.

మండలంలోని అంగడిపేట గ్రామ స్టేజ్ వద్ద 100 ఓల్టేజ్ ట్రాన్ఫరామ్ ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ 100 వోల్టేజ్ ట్రాన్ఫారం నూతన వసతులతో అంగడిపేట ప్రాంత ప్రజలకు విద్యుత్ సేవలు మరింత వేగంగా, నాణ్యంగా అందుతాయి. ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని.. మహాలక్ష్మి ఉచిత బస్సు పథకంలో భాగంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలు 2.65 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేయడం గర్వకారణంఅన్నారు.రాష్ట్రంలో ఈ పథకం ద్వారా దాదాపు ?10,000 కోట్ల ప్రయాణ భారం తగ్గి, అది నేరుగా కుటుంబాల పొదుపుగా మారిందని ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిని సమగ్రంగా పరిశీలించి, లక్ష్యాలను సమయానికి పూర్తి



చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా, ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు మన ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మండలంలోని అంగడిపేట క్రాస్ రోడ్డు వద్ద మరియు పెద్ద అడిశర్లపల్లి మండల కేంద్రంలో వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ జయశ్రీ , అన్ని విభాగాల అధికారులు, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిపక్షాల బురద రాజకీయం

**మొదటి పేజీ తరువాయి..**

కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని



తెలిపారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ. 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని ఏడాదికి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త గా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ధరణి తో రైతులు ఇబ్బందులు పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
శనివారం । 11 । ఏప్రిల్ । 2026



# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

### స్టేడియంలో ప్రజలతో కలిసి యోగాసనాలు చేసిన కలెక్టర్ రాజర్షి షా

**అక్షిత ప్రతినిధి/ అదిలాబాద్:** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. మారుతున్న జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు, శారీరక, మానసిక సమతుల్యత సాధించేందుకు యోగా అత్యుత్తమ సాధనమని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక', 'తెలంగాణ రైజింగ్ 2047' కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ డే సందర్భంగా 'హెల్త్ వీక్' వేడుకలలో యోగా శిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజలు, అధికారులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ఆరోగ్యం కోసం కలిసికట్టుగా.. విజ్ఞానంతో ముందుకు" అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం అరగంట సమయం యోగా లేదా వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజులప్రగతి ప్రణాళికలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. జిల్లాను ఆరోగ్యవంతమైన సమాజంగా తీర్చి దిద్దేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యోగా ద్వారా శరీర దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్‌లో ఘనంగా అంతర్జాతీయ హోమియోపతి దినోత్సవం..

**జగిత్యాల అక్షితబ్యూరో:** జగిత్యాల పట్టణములోని మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ లో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక 99 రోజుల ప్రణాళికలో భాగంగా, అంతర్జాతీయ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్ హెల్త్ క్యాంప్‌ను జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోమియోపతి ప్రాచీన వైద్య విధానమని, ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆయుష్ వైద్య విధానాలు (యోగా,





ఆయుర్వేదం,హోమియోపతి, యునాని) ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా, ఈ హెల్త్ క్యాంప్ ద్వారా ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ఔషధాలు అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమములో జిల్లా మెడికల్ హెల్త్ అధికారి జి. సుజాత, కౌన్సిలర్ ప్రశాంత్ రావు, డాక్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.

### సర్పంచ్ ఆధ్వర్యంలో లక్ష్మాపురం పైలెట్ ప్రాజెక్టు

# ఇందిరమ్మ ఇండ్లు పరిశీలన

**ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంత ఇంటి కళ నెరవేరుతోంది**

**పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు**

**ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా**

**లక్ష్మాపురం గ్రామ సర్పంచ్ గుగులోత్ రవీందర్ నాయక్**



**నాగారం, అక్షిత న్యూస్:** మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామం అభివృద్ధి దిశగా ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో వేగంగా ముందుకు సాగుతోంది. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు నాయకత్వంలో లక్ష్మాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేయడం గ్రామ అభివృద్ధికి కొత్త దిశను చూపించింది. పేదలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పథకం గ్రామంలో అత్యంత వేగంగా కొనసాగుతూ పేద ప్రజల జీవితాల్లో కొత్త ఆశలను నింపుతోంది. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా గ్రామ సర్పంచ్ గుగులోత్ రవీందర్ నాయకత్వంలో ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే లక్ష్మాపురం గ్రామానికి దాదాపు మూడు కోట్ల రూపాయల నిధులను కేటాయించడంతో ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. కొన్ని సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక తాత్కాలిక నివాసాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు ఇప్పుడు సొంత ఇంటి కళ నిజమవుతున్న సందర్భం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ నేపద్యంలో గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ గుగులోత్ రవీందర్ నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి బి. గోపి, వార్డు సభ్యులు మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యక్షంగా పరిశీలించారు. నిధుల వినియోగం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి నిర్మాణ పనులు మరింత వేగంగా పూర్తి అయ్యేలా సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ లక్ష్మాపురం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపిక చేసి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కు గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఇప్పుడు కొత్త కళ ఆశ కలిగిందని అన్నారు. గ్రామపంచాయతీ తరఫున ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇల్లు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే లక్ష్మాపురం గ్రామంలోని పేద కుటుంబాలు తమ సొంత ఇండ్లలో నివసించే రోజు రాబోతుందని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరవేయడంలో గ్రామపంచాయతీ ఎల్లప్పుడు ముందుంటుందని, పార్టీలకతీతంగా ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజలు సహకరించి గ్రామ అభివృద్ధి పరంగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లతో పాటు, గ్రామంలో మౌలిక సదుపాయాలు కూడా మెరుగు పడుతున్నాయని, త్వరలోనే లక్ష్మాపురం గ్రామం మండలంలో ఆదర్శ గ్రామంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెండెల ఉపేందర్, వార్డు మెంబర్లు మల్లెపాక వెంకటయ్య, తడకమల్ల శృతి మధు, మాజీ ఉపసర్పంచ్ తడకమల్ల నాగమల్లయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిప్పలపెల్లి ముత్తయ్య, మల్లెపాక సైదులు, శాగంటి అంజయ్య, మాజీ వార్డ్ మెంబర్ తడకమళ్ళ మధుసూదన్, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# రాంసాగర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**కొమురవెల్లి అక్షిత న్యూస్:** కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అక్కెనపల్లిరాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ మల్లారెడ్డి మరియు వార్డు సభ్యుల ఆధ్వర్యంలో డా. రాజేశ్వర్ ఎండీ, డెంటల్ డాక్టర్ భావన,లలిత భవాని హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మంది గ్రామ ప్రజలు పాల్గొని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. రోగులకు అవసరమైన బ్లడ్ టెస్ట్,షుగర్ టెస్ట్,ఈసీజీ వంటి ముఖ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించి,సరైన మందులు మరియు వైద్య సూచనలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాంసాగర్ గ్రామ సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని,భవిష్యత్తులో కూడా ఇలాంటి



కార్యక్రమాలు మరింతగా నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేసినందుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# యోగాతో శారీరక,మానసిక ఆరోగ్యం

**- జిల్లా కలెక్టర్**

**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రజాపాలన-ప్రగతి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆరోగ్య థీమ్ – డే 5 సందర్భంగా శుక్రవారం "ప్రపంచ హోమియోపతి దినోత్సవం ఆయుష్ దినోత్సవం" వేడుకలు ఖిలా వరంగల్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి.

ఉదయం స్వయంభూ దేవాలయం వద్ద నిర్వహించిన యోగ ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని స్వయంగా యోగ ఆసనాలు చేసి, యోగ ద్వారా శారీరక-మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.

అదనపు కలెక్టర్ రెవిన్యూ జి సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివ రావు పాటు ఆయుష్ డాక్టర్స్, జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ముదిరాజ్ భవన్‌లో ఆయుష్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు.



# కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం...

### విద్యారణ్యపురిలో 8 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

### నగరాన్ని సమాంతరంగా అభివృద్ధి చేస్తాం: మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** తమ పాలకవర్గంలో నగరాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా శుక్ర వారం రోజు నగరంలోని 3 వ డివిజన్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. విద్యారణ్యపురి రోడ్డు నెంబర్ 1 లో స్థానిక కార్పోరేటర్ సాదినేని లావణ్య మునింధర్, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి తో కలిసి 8.70 లక్షల నిధులతో సీసీ రోడ్డుకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సీసీ రోడ్డు నిర్మాణం కు శ్రీకారం చుట్టడం పట్ల స్థానిక డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పనుల ప్రారంభానికి ముఖ్య అతిథిగా వచ్చిన మేయర్ కొల గాని శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తుందని స్పష్టం చేశారు. విలీన గ్రామాల, శివారు ప్రాంతాల డివిజన్లను ప్రాధాన్యతగా తీసుకొని నగరంతో సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా 3వ డివిజన్ విద్యారణ్య పురిలో 8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభం చేశామని తెలిపారు. నగర వ్యాప్తంగా కాలనీల్లో అంతర్గత రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్ది ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే మొదటి ప్రాధా న్యత అని స్పష్టం చేశారు. చేపట్టిన పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికాకులను ఆదేశించినట్లు తెలిపారు. కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మా పాలకవర్గం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ





కార్యక్రమంలో కార్పోరేటర్ గాజ రమ శివరాం, ఈఈ శివానందం, ఏఈ గఫూర్, కాలని వాసులు కూర రాఘవ రెడ్డి, కళ్ళెం మధుసూదన్ రెడ్డి, కోరేపు లక్మయ్య, రాజలింగారి రాం రెడ్డి, ముత్యాల మల్లారెడ్డి, గుర్రం శ్రీధర్ రెడ్డి, ఆమనగంటి క్రిష్ణ చైతన్య, బద్దం రాం రెడ్డి, గుర్రం తిరుపతి రెడ్డి, జడల రఘునందన్, సూర శ్రీనివాస్, అరికొంతం మనోహర్ రెడ్డి, కోల మల్లా రెడ్డి, బోడ శ్రీధర్ రెడ్డి, గట్ల సురేందర్ రెడ్డి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భద్రాచలంలో జర్నలిస్టుల ఐక్యత

### ప్రెస్ క్లబ్ భవనం కోసం తహసీల్దార్‌కు వినతి

**భద్రాచలం(అక్షిత ప్రతినిధి):** భద్రాచలం పట్టణంలోని జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా వివిధ ప్రెస్ క్లబ్‌లు ఏకమయ్యాయి. పట్టణంలో రిజిస్టర్ అయిన అన్ని ప్రెస్ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు సమావేశమై, జర్నలిస్టులందరికీ ఉమ్మడిగా ఒక ప్రెస్ క్లబ్ భవనం, మీటింగ్ హాల్ అవసరమని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులు తమ వృత్తిపరమైన కార్యక్ర మాలు నిర్వహించేందుకు సరైన వేదిక లేకపోవడం వల్ల ఎదుర్కొం టున్న ఇబ్బందులను ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ.. ప్రెస్ క్లబ్ కోసం




తగిన ప్రభుత్వ స్థలం కేటాయింపుపై సాధ్యమైనంత త్వరలో అవసర మైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# వెలిశాల గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మార్వో

**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:**

తిరుమలగిరి మండల పరిధి వెలిశాల గ్రామపంచాయతీ వెలిశాల చౌరస్తాలో గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ వారి ఆధ్వర్యంలో, ముఖ్య అతిథిగా తిరుమలగిరి తాహసిల్దార్ హరిప్రసాద్





చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది అని అన్నారు .

తాహసిల్దార్ హరి ప్రసాద్ మాట్లాడుతూ తాగునీరు అనేది ప్రతి మనిషికి అత్యవసరమైన అవసరం. ఈ చలివేంద్రం ద్వారా ప్రతీ దాహార్థికి చల్లని నీరు అందించడం ఒక గొప్ప సేవ. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మనుషుల మధ్య అనుబంధాన్ని పెంచి, సేవా భావాన్ని మరింత బలపరుస్తాయి.

ఈ చలివేంద్రం నిరంతరం ప్రజ లకు సేవ చేయాలని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఈ చలివేంద్రం త్రాగునీరు సేవ చేయడం గ్రామ సర్పంచ్ మంజుల సతీష్ గౌడ్ వారికీ అభిమానించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ధరావతు భీంజా నాయక్, వార్డు మెంబర్లు, దండిగ సుశీల, జనగాం శ్రీలత , పులిమామిడి అశోక్ , కేతిరెడ్డి చెన్నారెడ్డి , సంకేపెల్లి వెంకట్ రెడ్డి, కొడకండ్ల సోమిరెడ్డి, జెరూపోతుల భద్రయ్య,గడ్డం వెంకన్న , మాజీ వార్డు మెంబర్ మొరిగార్డుల వెంకన్న, చిత్తలూరి అనిల్ గౌడ్, చిత్తలూరి సోమయ్య , బొమ్మెరా యాకన్నా , దండిగ రవి, సుబ్బారాయుడు, వంగపల్లి సురేష్, ముఖ్య నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# వేసవి దృష్ట్యా స్విమ్మింగ్ పూల్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అక్షిత ప్రతినిధి/ అదిలాబాద్:** వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు, చిన్నారులకు సౌకర్యవంతమైన వాతా వరణంలో ఈత అభ్యాసం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా స్విమ్మింగ్ పూల్‌లో నీటి శుభ్రత, ఫిల్టరేషన్ వ్యవస్థ, చేంజింగ్ రూములు, షవర్ సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. పూల్‌లోని నీరు నాణ్యంగా ఉండేలా తరచూ శుద్ధి చేయాలని, క్లోరినేషన్‌ను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పూల్‌కు వచ్చే క్రీడాకారులు, విద్యార్థులు ఎలాంటి ఇబ్బం దులు ఎదుర్కొనకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిం చాలని, ప్రత్యేకంగా మహిళలు, చిన్నారుల కోసం వేర్వేరు సమయాలు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు తెలిపారు. అలాగే లైఫ్ గార్డులు ఎల్లప్పుడూ విధుల్లో ఉండేలా చూడాలని, ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వేసవి కాలంలో అధిక సంఖ్యలో ప్రజలు స్విమ్మింగ్ పూల్‌ను వినియోగించే అవకాశం ఉన్నందున, శుభ్రత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. క్రీడలను ప్రోత్సహించే దిశగా స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులో ఉంచడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన రైతులలో ఊరట, మనోనిబ్బరం నింపాయి

### గొల్లపల్లి చీర్కపల్లి రైతుల ఉద్యమం పోరాట స్ఫూర్తికి నిదర్శనం

### భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులకు ప్రజలకు కృతజ్ఞతలు

### విలేకరుల సమావేశంలో బిఆరెస్ నాయకులు

**అక్షిత, వనపర్తి ప్రతినిధి:** మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన రైతులలో ఊరట, మనోనిబ్బరం నింపాయని, గొల్లపల్లి చీర్కపల్లి రైతుల ఉద్యమం పోరాట స్ఫూర్తికి నిదర్శనం అని బిఆరెస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాణిక్యం, ఉంగ్లం తిరుమల్ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హరీష్‌రావు నిన్నటి గొల్ల పల్లి సభ రైతులలో ఊరట మనోనిబ్బరం కలిగించాయన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నాయకత్వంలో రైతుల కోసం రెండు చారిత్రాత్మక



మైన సభలు విజయవంతం అయినాయని ఈ రెండు సభలలో పాల్గొని బి.ఆర్.ఎస్ శ్రేణులలో పోరాట స్ఫూర్తినింపిన మాజీ మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛందంగా 10వేల మందికి పైగా తరలివచ్చిన రైతులకు ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ సభ విజయవంతం చేయడానికి కృషి చేసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ సహకరించిన ఆర్.ఎస్ .ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మా రెడ్డి,ఎం.ఎల్.ఏ విజయుడు, ఎం.ఎల్.సి.నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, అల వెంకటేశ్వర్ రెడ్డి, బీరం. హర్షవర్ధన్ రెడ్డి, చిట్టెం.రామ్ మోహన్ రెడ్డి మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్స్, ముఖ్యంగా సహకరిం చిన పోలీస్ అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్ సాగర్, నీలస్వామి, సూర్యవంశం.గిరి, మహేశ్వర్ రెడ్డి, ముద్దు సార్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి సోమబోయిన నర్సమ్మకు అందజేత

### ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

### గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

### మామిడిపల్లి గ్రామ సర్పంచ్ అంబటి శ్రీనివాస్


**నాగారం, అక్షిత న్యూస్:** మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన సోమబోయిన నర్సమ్మ తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. ఆర్థిక ఇబ్బందుల మధ్య చికిత్స పొందుతున్న ఆమెకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలనే



ఉద్దేశంతో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ప్రత్యేకంగా స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.60,000/- ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ఈ సహాయాన్ని మామిడిపల్లి గ్రామ సర్పంచ్ అంబటి శ్రీనివాస్ చేతుల మీదుగా సోమబోయిన నర్సమ్మకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్షమని తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు వారికి తక్షణమే సహాయం అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్స కోసం ఆర్థిక భారం తగ్గించేలా సహాయం అందించడం ఎంతో ఉపయుక్తమని తెలిపారు. అలాగే తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, అవసరమైన చోట సహాయం అందించేందుకు ముందుండి పనిచేస్తున్నారని కొనియాడారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఇలాంటి సహాయాలు అందించడం ప్రజలకు పెద్ద భరోసా నిస్తుందని తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం ద్వారా అందే ప్రతి సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సతీష్, వార్డ్ మెంబర్ పేరాల సైదులు, గుండెబోయిన దేవమ్మ, గ్రామ సీనియర్ నాయకులు సోమనర్సయ్య, లింగంపెల్లి రాము, జటంగి వెంకన్న, సౌనయ్య, నరసింహ, సోషల్ మీడియా కో- ఆర్డినేటర్ మొల్కపురి సాయికుమార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ యజ్ఞ వరాహ స్వామి హిందూ సమ్మేళనం

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ, గాయత్రి నగర్ బస్తి ల హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. శ్రీ యజ్ఞ వరాహస్వామి హిందూ సమ్మేళనం పేరిట నిర్వహించిన ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులు, వక్తలుగా సి ఎ చోళ్ళేటి రమేష్ అధ్యక్షులు ,అన్నదానం సుబ్రహ్మణ్యం ,శ్రీ శ్రీ శ్రీ ఆత్మరాం సురేష్ మహారాజ్ , డాక్టర్ నీలిమ జిల్లా సంఘ్ చాలాక్ నిరంజనచారిలు హాజరై మాట్లాడారు. సమాజంలో కులాల పేరుతో విభజన పెరుగుతున్న నేపథ్యంలో హిందువులు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని



సూచించారు. విదేశీ ప్రభావాలను ఎదుర్కొనేందుకు సమాజంలో ఐక్యత అత్యంత అవసరమని, అదిశగా హిందువులంతా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. హిందూ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహించడంఅభినందనీయమన్నారు. ఈ సమ్మేళనంలో హౌసింగ్ బోర్డ్, గాయత్రి నగర్ ప్రజలు, విద్యార్థి విద్యార్థులు 720 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఆడ పిల్లలకు జన్మనిస్తుందనే సాకుతో

# భార్య, ఇద్దరు పిల్లలు హత్య

**వరంగల్, అక్షిత బ్యూరో:**

రాష్ట్ర వ్యాప్తంగా సంచలంగా మారిన భార్య ఇద్దరు బాలికల హత్యకు సంబంధించి కేసులో హత్య గురైన మృతురాలి భర్తతో పాటు ఈ హత్యలకు పరోక్షంగా కారణంగా నిలిచిన మరో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు.

పోలీసులు అరెస్టు చేసిన వారిలో ప్రధాన నిందితుడు వరంగల్ జిల్లా, పున్నేలు గ్రామానికి చెందిన యం.డి అజారుద్దీన్ (29)తో పాటు, నిందితుడి కుటుంబ సభ్యులు పున్నేలు గ్రామానికి చెందిన యం.డి చాంద్‌పాషా (49),యం.డి సలీహా (45), యం.షరోద్దీన్ (25)లతో పాటు బసిక స్రవంతి(32),కడిపికొండ, బాల్నె పార్థు (47) నెక్కొండ, బొమ్మెర మనోహర్(39), గీసుగొండ, లింగాల నరేష్(37), కొండపర్తి, సాట్లరాజు (32),పున్నేలు, వాకుదోట్ భద్రు (60), ఎనుగల్లు చెందిన వారిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు డా. బాల్నె పూర్ణిమ, డా. ఎస్.రవళీ ప్రస్తుతం పరారీలో వున్నారు.

ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ మీడియాకు వివరాలను వెల్లడిస్తూ ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు అజారుద్దీన్ ఇదే గ్రామానికి చెందిన మృతురాలు ఫరహాత్‌ను 2016 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి హుమేరా (09), ఆయేషా (06) జన్మనిచ్చారు. కాని నిందితుడి కుటుంబ సభ్యులకు కుమారుడు పుట్టాలని కోరిక వుండేది. 2021, 2022 సంవత్సరాల్లో మృతురాలు గర్భం దాల్చడంతో తిరిగి అడ పిల్లకు జన్మనిస్తుందనే అపనమ్మకంతో ప్రధాన నిందితుడితో పాటు అతని కుటుంబ సభ్యులు పున్నేలు గ్రామానికి చెందిన మందుల షాపు నిర్వహిస్తున్న సట్ల రాజుతో పాటు మిగితా నిందితులు ఆర్.యం.పి నరేష్, ల్యాబ్ టెక్నిషియన్ మనోహర్, కాజీపేటలోని సురక్షా హస్పటల్ డాక్టర్ రవళి, నర్సు స్రవంతి, నెక్కోండకు చెందిన ఉపేందర్ హస్పటల్ డాక్టర్ పూర్ణిమల సహకారంతో నిందితుడు మృతిరాలికి లింగా నిర్ధారణ చేయించి పుట్టబోయేది ఆడ పిల్లయని నిర్ధారించుకోని మృతురాలికి ఇష్టం లేకున్నా రెండు దఫాలు నిందితుడు మృతురాలికి ఆబార్షన్ చేయించడం జరిగింది.

ఇదే సమయంలో నిందితుడి దూరపు బంధువైన మైనర్ బాలికపై ప్రేమ పెంచుకున్న నిందితుడు పెళ్ళి చేసుకుంటాను అని మైనర్ బాలికకు నిందితుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంతో నీకు ఇంతకు ముందే పెళ్ళి అయి ఇద్దరు పిల్లలు వున్నారు. నేను నిన్న పెళ్ళి చేసుకోనని మైనర్ బాలిక నిరాకరించడంతో, తనకు భార్య పిల్లలు వుండటం కారణంగానే మైనర్ బాలిక పెళ్ళి అంగీకరించడం లేదని భార్య పిల్లలపై కక్ష్య పెంచుకున్నాడు నిందితుడు. ఇదే సంవత్సరం మార్చ్ నెలలో మృతురాలు ఫరహాత్ గర్భం దాల్చడంతో తమకు తిరిగి ఆడపిల్ల జన్మనిస్తుందనే భయంతో నిందితుడుతో పాటు తల్లిదండ్రులు, తమ్ముడు అబార్షన్ చేయించుకోవాల్సిందిగా పలుమార్లు మృతురాలితో గోడవ పడేవాడు. అలాగే తను ప్రస్తుతం ప్రేమిస్తున్న బాలికను పెళ్ళి చేసుకోవాలంటే భార్య,పిల్లలు బ్రతికుండగా సాధ్యం కాదని, వారిని చంపడం ద్వారా ఇది సాధ్యమని




నిర్ణయించుకున్నాడు నిందితుడు.

ఇందుకోసం నిందితుడు తాను అనుకున్న ప్రణాళిక ప్రకారం ఈ నెల 1వ తారీఖు రాత్రి సుమారు 7.50 గంటలకు ఐసు క్రీం తినిపిస్తానని భార్య పిల్లలను తాను నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ వద్దకు కారులో తీసుకరావడం జరిగింది. ప్రణాళిక ప్రకారం నిందితుడు ముందుగానే స్విమ్మింగ్ పూల్ వద్ద సిసి కెమెరాలు, కరెంటు నిలిపి వేయడంతో స్విమ్మింగ్ చేరుకున్న మృతులను నిందితుడు బలవంతంగా స్విమ్మింగ్‌లోకి నెట్టివేసి స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయిన భార్య పిల్లలను బలవంతంగా వారు చనిపోయేవరకు వారిని నీటిలో ముంచి దారుణంగా హత్య చేసాడు. ఈ ముగ్గురిని హత్య చేసిన అనంతరం నిందితుడు వీరు మరణించినట్లుగా నిర్ధారించుకోని తన భార్య పిల్లలు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చేందారని ప్రచారం చెశాడు. మృతిరాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు తమకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని నిందితుడు ఆజారుద్దీన్ తన భార్య పిల్లలలను దారుణంగా హత్య చేసినట్లుగా నిర్ధారణకు వచ్చారు. పట్టుబడిన నిందితుల్లో స్రవంతి పై మూడు కేసులు, డా. పార్థు మీద నాలుగు కేసులు, ప్రస్తుతం పరారీ లో వున్న డా. పూర్ణిమ పై నాలుగు కేసులు ఉన్నట్లుగా పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

ఈ హత్యలకు పాల్పడిన నిందితుడి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో, నిన్న సాయంత్రం పోలీసులకు పట్టుపడటం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలియజేసారు.

ఈ కేసును పరిష్కరించడంతో పాటు నిందితుడుని పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామూనూర్ ఏసీపీ వెంకటేష్ పర్వతగిరి సిఐ రాజగోపాల్, గీసుగొండ ఇన్స్ స్పెక్టర్ విశ్వేశ్వర్,మామూనూర్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్, ఐనవోలు ఎస్., పర్వతగిరి, మామూనూర్ ఎస్.ఐ లు శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీకాంత్, కానిస్టేబుళ్లు హేమకుమార్, శ్రీనివాస్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# మహనీయుల జయంతి రోజు మాంసాహారం, మద్య నిషేధం పాటించేలా చర్యలు తీసుకోవాలి

### భారతీయ బౌద్ధ మహా సభ డిమాండ్


**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** జ్యోతి బాపులే, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, తథాగత్ భగవన్ బుద్దుడి, జయంతి రోజు మాంసాహారం, మద్య, నిషేధం పాటించేల అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని భారతీయ బౌద్ధమసభ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సమతా సైనిక్ దళ్ సంస్థ ప్రతినిధులు అధికారులను, రాష్ట్ర ప్రభుత్వంను కోరారు. శుక్రవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించి, బానిసత్వం కుల నిర్మూలన పై జీవితాంతం పోరాటం చేసి భారత దేశ ప్రజల విముక్తి కోసం బాటలు వేసి, భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సంఘసంస్కర్త జ్యోతిబాపూలే, ప్రపంచ శాంతి కోసం తన జీవితాన్ని అర్పించిన శాంతి దూత భగవాన్ బుద్ధ బుద్దుడు లాంటి మహనీయుల జయంతిల (పుట్టిన రోజుల) సందర్భంగా మద్యపాన జంతు బలి నిషేధం,అమలు చేసి తద్వారా ప్రజలకు అధికారులు, ప్రభుత్వం ఒక ఆదేశాన్ని అందించాలని వారు కోరారు. అధికారులు, ప్రభుత్వం ఈ నిర్ణయం



తీసుకోవడం వల్ల కొత్త సాంప్రదాయం తెరబ్రిసినట్లు ఉంటుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్,సమతా సైనిక దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్, బి ఎస్ ఐ జిల్లా ఆర్గనైజర్ విజయ్ ఉప్రే,సమతా సైనిక్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రోషన్,భారతీయ బౌద్ధ మహా అధ్యక్షులు జైరాం, అంబెడ్కర్ సంఘం అధ్యక్షుడు దుర్గం దుర్గాజి,ఉపాధ్యక్షులు శ్యామ్ రావు దొండుజి దుర్గం,సమాజ్ అధ్యక్షులు శ్యామ్రావు లహుజీ,దుర్గం, రాజేశ్వర్ ఉప్రే, కార్యదర్శి ప్రతాప్,నాయకులు నాగ్ సేన్,ప్రశాంత్, రమేష్, కొయ్యల మహేష్,తిరుపతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.








# ఈషా స్కూల్‌లో రాయల్స్ అవార్డు వేడుక

### ప్రతి చిన్నారి ప్రతిభకు గౌరవ వేదిక

### ఘనంగా పిల్లల గ్రాడ్యుయేషన్ వేడుక

**జగిత్యాల, అక్షితబ్యూరో:** జగిత్యాల పట్టణములోని గోవింద్ పల్లె లోని ఈషా స్కూల్ ఆఫ్ నాలెడ్జ్ పాఠశాలలో ఈషా రాయల్స్ అవార్డు వేడుకను ఘనంగా నిర్వహించారు ఈ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కేవలం అవార్డుల పంపిణీకి మాత్రమే కాకుండా, ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడం, అభినందించడం, ప్రేరేపించడం లక్ష్యంగా నిర్వహించబడింది అని పాఠశాల చైర్మన్ కంది కైలాసం తెలిపారు ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశను ఆనందంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణ ఆనందోత్సాహాలతో కళకళలాడింది. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకుని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ప్రత్యేకంగా నిలిచింది. విద్యార్థులను ఒక్కొక్కరిని వేదికపైకి ఆహ్వానించి, ప్రిన్సిపల్, డైరెక్టర్లు వారి చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అభినందనలు తెలుపుతూ వారి భవిష్యత్తు విజయాల కోసం శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు గౌన్లు, టోపీలు ధరించి సర్టిఫికెట్లు స్వీకరించడం కార్యక్రమానికి మరింత ఆకర్షణను తెచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రంజిత్ మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు మంచి విలువలు, నైతికతలను అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమని సూచించారు. పిల్లల అభివృద్ధికి తోడ్పడిన తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ అంకితభావంతో విద్యార్థులను ఈ స్థాయికి తీసుకు వచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రతి విద్యార్థిని జాగ్రత్తగా పరిశీలించి, వారి ప్రతిభ, కృషి మరియు ప్రగతిని ఆధారంగా తీసుకుని అవార్డులను అందచేశారు. ప్రతి చిన్నారి ప్రత్యేకమే అనే నమ్మకంతో ప్రతి విద్యార్థికి అవార్డు అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. విద్యార్థులను ఈషా రాయల్స్ గా అభివర్ణిస్తూ వారిలో ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మెరుగైన స్థాయికి ఎదగగల సామర్థ్యం కలిగినవారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కంది కైలాసం, కరెస్పాండెంట్ అన్నపూర్ణ, డైరెక్టర్ నాగమణి, అకాడమిక్ కోఆర్డినేటర్ కవిత, ప్రిన్సిపల్ రంజిత్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వారి సమక్షంలో ఈ వేడుకకు మరింత గౌరవాన్ని మరియు ప్రత్యేకతను తీసుకువచ్చింది. తల్లిదండ్రుల చప్పట్లు, ప్రోత్సాహం మరియు హాజరు విద్యార్థుల్లో

ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. కార్యక్రమం సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఫోటోలు తీసుకుని ఈ ఆనంద క్షణాలను స్మరణీయంగా నిలుపుకున్నారు.

పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ మాట్లాడుతూ, చిన్న విజయాలను గుర్తించి గౌరవించడం ద్వారా పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని తెలిపారు. ఈ అవార్డు వేడుక విద్యార్థులకు కొత్త ఉత్సాహాన్ని నింపి, మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణనిచ్చింది అని అన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం..

### అరైవ్ - అలైవ్‌పై పోలీస్ కమిషనర్ సమీక్ష

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** రోడ్డు ప్రమాదాల రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ క్యాంపెయిన్ అమలుపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శు క్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఈ నెల 13 నుండి 18వ తేదీ వరకు వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఇందులో భాగంగా వారం రోజుల పాటు రోజుకో ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మొదటిరోజు 13వతేది సోమవారం ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి, స్థానిక ప్రజలకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడం. రెండవరోజు 14వతేది మంగళవారం వాహనదారులు, విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా సామూహిక ప్రమాణ స్వీకార కార్యక్రమాలు చేపట్టడం. మూడవరోజు 15 వ తేది బుధవారం ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను





(బ్లాక్ స్పాట్స్) గుర్తించి, అక్కడ తక్షణమే హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్స్ మరియు రోడ్ మార్కింగ్స్‌ను పునరుద్ధరించడం. నాల్గవరోజు 16వ తేది గురువారం విద్యార్థులకు పాఠశాలల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, చిన్నతనం నుంచే ట్రాఫిక్ క్రమశిక్షణ అలవడేలా విద్యార్థులకు అవగాహన కల్పించడం. ఆటో, బస్సు, లారీ డ్రైవర్లకు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించి, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతను వివరించడం. ఐదవరోజు 17వ తేది శుక్రవారం ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్) లో బాధితులకు అందించాల్సిన ప్రాథమిక చికిత్స, సహాయంపై ప్రజలకు వివరించడం. ఆరవరోజు 18 వ తేది శనివారం వారంలో ఒక రోజు ట్రాఫిక్ ఉల్లంఘనలపై జరిమానాలు విధించకుండా, కేవలం కౌన్సెలింగ్ ద్వారా వాహనదారుల్లో మార్పు తీసుకురావడం వంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. నిబంధనల పట్ల నిర్లక్ష్యం ప్రాణనష్టానికి దారితీస్తుంది. అరైవ్ అలైవ్ లక్ష్యం నెరవేరాలంటే డ్రైవర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సురక్షిత ప్రయాణం - సుఖమయ జీవనం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.



# అంగన్వాడి కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమం

### - సూపర్వైజర్స్ కే.మంజుల, జి.ప్రసన్న

**నాంపల్లి, అక్షిత న్యూస్:**

నాంపల్లి మండలం పరిధిలోని ముష్టిపల్లి, రాజ్య తండా అంగన్వాడి కేంద్రాలలో పోషణ పక్వాడ ప్రోగ్రాం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సూపర్వైజర్స్ కే మంజుల, జి ప్రసన్న పిల్ల తల్లులకు చిరుధాన్యాల విలువల గురించి 0-3 సంవత్సరాల పిల్లల ఎదుగుదలకు(1000 )రోజులను గోల్డెన్ డేస్ గా తెలియజేయడమైనది పుట్టిన బిడ్డ 3 సంవత్సరాలు నిండేవరకు ప్రతిరోజు చాలా ముఖ్యమైనది బిడ్డ పెరుగుదలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించవలసిందిగా అనగా 3 నెలలకు బోర్ల పడుతున్నాడా మెడలు నిలుపుతున్నాడా పిల్లవాడిని గమనిస్తున్నారా ఇంకా ప్రతి నెల కూర్చోవడం నిలవడం అన్ని విషయంలో జాగ్రత్తగా గమనించవలసింది తెలియజేయడమైనది ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఏడవ నెల నుండి అనుబంధ ఆహారం పెట్టవలసిందిగా ప్రతినెల బరువును వేయించుకొని తమ బిడ్డ బరువు ఎలా ఉందో అంగన్వాడి టీచర్ ని అడిగి తెలుసుకోవాలని బిడ్డకు ఫుడ్ తినిపించేటప్పుడు సెల్ ఫోన్, టీవీలు చూపించకుండా తల్లిదండ్రులు కబుర్లు చెబుతూ తినిపించాలనీ ఆరు సంవత్సరాల లోపు పిల్లల భవిష్యత్తు చాలా ముఖ్యమని తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి గర్భవతులు బాలింతలు పిల్లల తల్లిదండ్రులు పల్లె డాక్టర్ అంగన్వాడి టీచర్లు సరస్వతి సునీత భారతి ఆశా వర్కర్ అంగన్వాడి హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతోనే శారీరక-మానసిక ఆరోగ్యం సాధ్యం

### జిల్లా కలెక్టర్ కె. హరిత

**ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో:** యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా జయించవచ్చని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు శుక్రవారం యోగ ఫర్ వన్ ఎర్త్ - వన్ హెల్త్ నినాదంతో జిల్లా సముదాయ కార్యాలయశీ లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఒక సమగ్ర పరిష్కారమని అన్నారు. యోగా కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానమని, దీన్ని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని అన్నారు. యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందడమే కాకుండా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభించడం వల్ల వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మొత్తానికి సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు జిల్లాలో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయడం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు యోగా సాధన వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక స్థిరత్వం పెరుగుతాయని అన్ని అన్నారు ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఉదయం పాఠాలు ప్రారంభానికి ముందు యోగా నిర్వహణను చేపట్టాలని సంబంధిత అధికారులతో అన్నారు .



ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు, డీఆర్‌డీఓ దత్తారావు, వైద్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## 30 వార్డులో ఆడబిడ్డ పెండ్లికి 21000 ఇస్తామని మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్ విజయలక్ష్మి నాగరాజు

**వికారాబాద్, అక్షిత బ్యూరో:** ఇందిరానగర్ గరీబ్నగర్ కౌన్సిలర్ విజయ లక్ష్మి నాగరాజు పలు శుభకార్యాలలో పాల్గొని ఇచ్చిన మాట కట్టుబడి నా కాలనీలో ప్రతి ఆడ బిడ్డ పెళ్లికి నా వంతు సహాయంగా 21000 ఇస్తానని మాట ఇవ్వడం జరిగింది. ఆ మాట నిలబెట్టుకున్న ఇందిరానగర్ కౌన్సిలర్ విజయలక్ష్మి నాగరాజ్ ఇచ్చిన మాట ప్రకారం వికారాబాద్ పట్టణంలోని 30వ వార్డు పరిధిలోని గరీబ్ నగర్ కాలనీ కి చెందిన కావలి రమేష్ స్వరూప కూతురు అయిన రాఘవి వివాహానికి 21వేల ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెసు పార్టీ 30వ వార్డు కౌన్సిలర్ నాగరాజు విజయలక్ష్మి ఈ కార్యక్రమం లో కాలనీ వాసులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## లారీ చౌరస్తాలో ఆటోలో తరలిస్తున్న ప్లాస్టిక్ స్వాధీనం

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని లారీ చౌరస్తా ప్రాంతంలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న నిషేధిత ప్లాస్టిక్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో ఈ చర్యలు



చేపట్టారు. ఈ సందర్భంగా పర్యావరణ ఇంజనీర్ డి. ప్రణీల్ కుమార్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి, ఆటోలో తరలిస్తున్న ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం మరియు రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

## కరకట్టను బలోపేతం చేసి భద్రాచలం పట్టణాన్ని కాపాడాలి

**భద్రాచలం(అక్షిత ప్రతినిధి):** ఆంధ్రాలో కలిపిన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలోనే ఉంచాలని, పోలవరం ముంపు నుండిఏ భద్రాచలం డివిజన్‌ను కాపాడాలని ఆనాడు భద్రాచలం ఎమ్మెల్యేగా ఉన్న శాసనసభ్యులు సున్నం రాజయ్య గారు, సిపిఎం జిల్లా నాయకులు అన్నవరపు కనకయ్య గారు సిపిఎం పార్టీ తరపున విజయం సాధించిన ప్రజా ప్రతినిధులు (ఎమ్మెల్యే,జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ మరియు



వార్డు మెంబర్లు ) ఆమరణ నిరాహార దీక్ష చేయడం జరిగింది. ఐదు గ్రామపంచాయతీలు పోలవరం ముంపు నుండి భద్రాచలం డివిజన్ ను కాపాడాలని, కరకట్టను మరింత పటిష్టం చేయాలని మొదటి నుండి సిపిఎం పార్టీ ఆందోళనలు పోరాటాలు నిర్వహించింది కరకట్టను బలోపేతం చేసి భద్రాచలం పట్టణాన్ని కాపాడాలని సిపిఎం పార్టీ అనేక పోరాటాలు ఆందోళనలు నిరాహార దీక్షలు చేపట్టింది.

# అంగన్వాడి కార్యకర్తలకు మొబైల్ ఫోన్లు పంపిణీ

### టెక్నాలజీ ద్వారా సేవలు మెరుగుపరుచుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయి : ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్

**వరంగల్, అక్షిత బ్యూరో:** గీసుగొండ-సంగెం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు గీసుగొండ కొనైమాకుల రైతువేదికలో మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, మహిళలు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

ఈ మొబైల్ ఫోన్ల ద్వారా పోషణ ట్రాకర్ యాప్, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్, ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభ స్థితి, లొకేషన్ ట్రాకింగ్, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ వంటి సేవలను మరింత వేగవంతంగా, ఖచ్చితంగా నిర్వహించ వచ్చని తెలిపారు. పిల్లల ఎత్తు, బరువు వివరాలను సకాలంలో నమోదు చేయడం ద్వారా పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను త్వరగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. ఈ డిజిటల్



సదుపాయాలు ఫీల్డ్ స్థాయిలో డేటా నాణ్యతను పెంచడంతో పాటు సేవల పర్యవేక్షణను బలోపేతం చేస్తాయని తెలిపారు. జిల్లాలోని మొత్తం 874 మంది అంగన్‌వాడీ టీచర్లు సూపర్వైజర్లకు దశలవారీగా మొబైల్ ఫోన్ల పంపిణీ చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి రాజమణి, సీడీపీఓ డెబోరా కార్యక్రమంలో సూపర్వైజర్లు, శాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## చంద్రబండ తాండల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ మహోత్సవం

- ఎంపీడీవో వెంకటేశ్వర్లు





**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపలి మండలం చంద్రబండ తాండల్లో ఎంపీడీవో వెంకటేశ్వర్లు మరియు హౌసింగ్ ఏఈ రాజవర్ధన్ రెడ్డి మరియు మాజీ సర్పంచ్ ముడవత్ రామ్ లాల్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ మహోత్సవం నిర్వహించడం జరిగింది. మాజీ చంద్రబండ తాండ గ్రామ సర్పంచ్ ముడవత్ రామ్ లాల్ గ్రామంలో ఎవరైతే నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ఉన్నయో వాటి నిర్మాణం పనులను సందర్శించి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబండ తాండ మాజీ సర్పంచ్ ముడవత్ రామ్ లాల్ మాట్లాడుతూ.గ్రామంలో ప్రభుత్వం ఇల్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ఇచ్చి వారి సొంతింటి కళను సాకారం చేయడం చాలా సంతోషంగా ఉందని, అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకి ఈ సందర్భంగా చంద్రబండ తాండ గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలువుతున్నామన్నారు. అర్హులైన లబ్ది దారులకు మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే కార్యక్రమం చెవుడుతున్నామని త్వరలో ఆ కార్యక్రమం కూడా మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఎవరైతే నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తు న్నారో కొందరికి బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. వాటిని కూడా మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తెలిసుకెళ్లి వీలైనంత త్వరగా వచ్చే విధంగా కృషి చేస్తామని అన్నారు. చంద్రబండ తాండ గ్రామ ప్రజలకు రాబోయే రోజుల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు సహాయ సహకారాలతో గ్రామంలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించి ,గ్రామ అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తామని ,జరగబోయే అభివృద్ధికి గ్రామ ప్రజల మద్దతు సపోర్ట్ తమకు అందివాలిని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చంద్రబండ తాండ గ్రామ సర్పంచ్ కెలవత్ చిట్టి , మాజీ ఉప సర్పంచ్ రవి నాయక్ , ఇందిరమ్మ ఇళ్ల ఏఈ. రాజవర్దన్ రెడ్డి . పెద్దకొత్తపలి ఎంపీడీవో వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శి మహేష్ ,కేతవత్ భాస్కర్ నాయక్ ,ముడవత్ హర్యా నాయక్, పాత్లవత్ సేవ్ల నాయక్ పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులలో క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసంను పెంపొందిస్తాయి..

- రాగం హరిశంకర్ యాదవ్..

**శేరిలింగంపల్లి, అక్షిత ప్రతినిధి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ పరిధిలోని నాగార్జున గ్రామర్ హై స్కూల్లో న్యూ మోంక్స్ కుంగ్-ఫూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కుంగ్-ఫూ బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 226-నల్లగండ్ల డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాగం హరి శంకర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై సుమారు 40 మంది విద్యార్థులకు తదుపరి స్థాయి బెల్టులు, ధృవపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కుంగ్-ఫూ వంటి శిక్షణలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని కూడా పెంచుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతర సాధనతో ఉన్నత స్థాయిలకు ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కుంగ్-ఫూ నైపుణ్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చిన్న వయస్సులోనే ఈ తరహా శిక్షణ పొందడం వారి సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ కార్యక్రమంలో పాఠశాల కొరస్పాండెంట్ కె. శ్రీనివాస్ శంకర్, ప్రధానోపాధ్యాయురాలు కె. శిరీష, తెలంగాణ



కుంగ్-ఫూ అసోసియేషన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎన్. బాలరాజు యాదవ్, రంగారెడ్డి జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి. రమేష్, మహబూబ్‌నగర్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె. సత్యం, బ్రూస్ లీ కుంగ్-ఫూ ప్రతినిధి నందు, హైదరాబాద్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఏ. యోగేశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక
శనివారం । 11 । ఏప్రిల్ । 2026





# పిల్లల సంరక్షణ కర్తవ్యం కావాలి

### అంగన్వాడీ టీచర్లకు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఉద్బోధ

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** పిల్లలను సంరక్షించడం అంగన్వాడీ టీచర్ల ప్రథమ కర్తవ్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని దుర్గాభాయ్ దేశ్ ముఖ్ మహిళా ప్రాంగణం లో 197 అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు, 15 మంది దివ్యాంగులకు రెట్రోఫిట్టెడ్ మూడు చక్రాల మోటారు సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించడమే కాకుండా టీచర్లచేత సమర్థవంతంగా పని చేయించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారికి సెల్ ఫోన్లు అందజేస్తున్నదని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లోనూ బోధనలో సాంకేతికను జోడించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అంగన్వాడీ టీచర్లు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, సెల్ ఫోన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వపరంగా వికలాంగుల సంక్షేమశాఖ ద్వారా దివ్యాంగులకు పెద్ద ఎత్తున ఉపకరణాలు అందిస్తున్నదని ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వం అందించే ఉపకరణాలు, యంత్ర పరికరాలు దివ్యాంగులకు వారి దినచర్యలో ఎంతగానో ఉపయోగపడతాయని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. అర్హులైన వారు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ చిన్నారులకు సరైన పోషణతో పాటు సరైన విద్యాబోధన చేస్తే శారీరకంగా, మానసికంగా ఎదుగుతారన్నారు. విద్యాబోధనపై నిర్లక్ష్యం వహించకూడదని, పిల్లలు వర్ణమాలలు చదవగలిగేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలకు ప్రభుత్వపరంగా సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో టీచర్లు కూడా తమ వంతు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. గ్రామాల్లో సీనియర్ సిటిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చే బాధ్యత అంగన్ వాడీ టీచర్లు, సూపర్ వైజర్లదేనని ఆమె చెప్పారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు చరవాణీలు అందిస్తున్నామన్నారు.

జిల్లా సంక్షేమశాఖాధిరి సరస్వతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలో పిల్లల సంరక్షణ, బోధనలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అలాగే దివ్యాంగుల సంక్షేమంపై కూడా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా అంగన్వాడీ టీచర్లు,సూపర్ వైజర్లను సమాయత్తపరుస్తున్నామని, ఈ విషయంలో ఎప్పటికప్పుడు వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, మహిళా ప్రాంగణం మేనేజర్ సుధారాణి,తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్రా, గ్రామీణ సీడీపీవో సిహెచ్ శ్రీలత, డీసీపీయూ రమేశ్, మహాత్మానగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, కొత్తపల్లి సర్పంచ్ గోదారి శోభారాణి, డీసీపీయూ రమేశ్, సూపర్ వైజర్లు కవిత, ఇస్రత్ సుల్తానా, వెంకటలక్ష్మి, అరుణ, పద్మ,రమ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్,పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, మామిడి అనిల్ కుమార్,నోముల అనిల్, పోలు రాము,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



## నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర డైరెక్టర్‌గా శంకరోల్ల సురేష్ ముదిరాజ్..

**శేరిలింగంపల్లి, అక్షిత ప్రతినిధి:** హైదరాబాద్‌లోని నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శంకరోల్ల సురేష్ ముదిరాజ్‌ను తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్‌గా అధికారికంగా నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని రాష్ట్ర చైర్మెన్ జంతా రామ్ చౌధరి, వైస్ చైర్మన్ వంగాల సతీష్, నేషనల్ డైరెక్టర్ నాగయ్య ముదిరాజ్ ల సమక్షంలో అందజేశారు. సురేష్ ముదిరాజ్ సామాజిక సేవ, ప్రజా పరిపాలన రంగాలలో విశేష అనుభవం కలిగి ఉండి, పర్యావరణ పరిరక్షణ, అవగాహన కార్యక్రమాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో కీలక పాత్ర పోషించనున్నట్లు తెలిపారు. ఈ నియామకంతో తెలంగాణ రాష్ట్రంలో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయనీ సురేష్ ముదిరాజ్ తెలిపారు.

## చలివేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే

**జగిత్యాల, అక్షితబ్యూరో:** జగిత్యాల పట్టణంలోని జనగణమన మిత్ర బృందం వారి ఆధ్వర్యంలో స్వర్గీయ ఉటూరి గంగారాం-సరోజన వారి జ్ఞాపకార్థం జగిత్యాల పాత



బస్టాండ్‌లో మండుతున్న ఎండల దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చుట కొరకు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ఫిల్టర్ ను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మున్సిపల్ చైర్‌పర్సన్ సముండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆర్టీసీ డీ.ఎం.కల్పన, నిత్య జనగణమన నిర్వాహకులు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సెల్ టవర్ బ్యాటరీల చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు

**వరంగల్, అక్షిత బ్యూరో:** శివారు ప్రాంతాల్లోని సెల్ టవర్ల సంబంధించిన బ్యాటరీలను చోరీలకు పాల్పడుతున్న ముఠాలోని ఐదుగురిని హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు సుమారు 1లక్ష 98వేల రూపాయల విలువ గల 144 సెల్ టవర్ బ్యాటరీలు, 2లక్షల 60వేల రూపాయల నగదు, రెండు ట్రాలీలు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు అరెస్టు చేసిన నిందితులందరు నల్గొండ జిల్లాకు చెందిన కొంపల్లి గణేష్ (27), బొంగరాల సుధాకర్ (30), తన్నీరు శివాజీ (26), బీమనబోయిన నరసింహ (31), గడగోజు సురేష్ (25)లు గుర్తించారు.

ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ పోలీసులకు పట్టుబడిన నిందితుల్లో ప్రధాన నిందితుడైన గణేష్ (డ్రైవర్) మిగితా మిగితా ఇద్దరు నిందితులైన సుధాకర్,శివాజీలకు జనరేటర్ మరమ్మత్తులు, సెల్ టవర్ పనులకు పరిజ్ఞానం కలిగి వుండటంతో ముఠాగా ఏర్పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే అలోచనతో సెల్ టవర్లపై పరిజ్ఞానం కలిగి వుండటంతో సెల్ టవర్లకు వినియోగించే బ్యాటరీల్లోని కొన్నింటి తప్పించడం ద్వారా సెల్ టవర్ పనతీరులో ఎలాంటి సమస్యలు రావని గుర్తించిన నిందితులు సెల్ టవర్ బ్యాటరీలను చోరీలు చేసేందుకుగా సిద్దపడి ఈ ముగ్గురు నిందితులు సెల్ టవర్‌లోని బ్యాటరీలను చోరీ చేసి మహరాష్ట్రలోని గచ్చిరోలి ప్రాంతంలో విక్రయించి వచ్చిన డబ్బుతో ముగ్గురు నిందితులు జల్సాలు చేసేవారు. ఇదే సమయంలో రాత్రి సమయాల్లో చెరువుల్లో చేపలను చోరీలకు పాల్పడే మిగితా ముఠా సభ్యులు సైతం కలవడంతో, ఈ ముఠా సభ్యులు చేపలు చోరీలకు పాల్పడే సమయంలోనే బ్యాటరీలు చోరీ చేసేందుకు అనుకూలంగా వున్న సెల్ టవర్లను గుర్తించిన సెల్ టవర్లలోని బ్యాటరీలను చోరీలకు పాల్పడేవారు. అలాగే చెరువుల్లో చోరీ చేసిన చేపలను నల్గొండ లో తక్కువ ధర విక్రయించేవారు. ఈ తరహాలో నిందితులు వరంగల్ కమిషనరేట్, యాదాద్రి,నల్గొండ,సూర్యపేట జిల్లాల్లో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 13 సెల్ టవర్ బ్యాటరీ చోరీలకు పాల్పడ్డారు. గత నెల మార్చ్ 3వ తారీకున హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతసాగర్ ప్రాంతంలోని సెల్ టవర్ నుండి 48 బ్యాటరీలకు చోరీకు గురికావడంతో ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు హసన్‌పర్తి పోలీసులు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత అధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని ముఠా సభ్యులను గుర్తించిన పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. పక్కా సమచారంతో ఈ రోజు తెల్లవారుజామున నిందితులు చోరీ సొత్తును అమ్మేందుకు హసన్‌పర్తి మండలం, దేవన్నపేట గ్రామ శివారు ప్రాంతంలోని అవుటర్ రింగ్ రోడ్డు టోల్ గేట్ వద్ద వేచి వున్న ముఠాలోని ఐదుగురు సభ్యులను హసన్ పర్తి పోలీసులు అరెస్టు చేసారు. నిందితులు ఇచ్చిన సమచారంతో పోలీసులు చోరీ సోత్తు స్వాధీనం చేసుకున్నారు.

నిందితులను పట్టుకొవడంలో ప్రతిభ కబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, హసన్‌పర్తి ఇన్స్‌స్పెక్టర్ చేరాలు,యస్ ఐ లు దేవేందర్, సుజిత్ రెడ్డి, కానిస్టేబుళ్ళు క్రాంతి కుమార్,బావు సింగ్,వెంకట స్వామి, భరత్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

## జిల్లా కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకటాచారి

**వికారాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాకు నియమితులైన రెవిన్యూ అదనపు కలెక్టర్ ఇ. వెంకటాచారి





పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలుసుకుని బాధ్యతలు స్వీకరించారు.

జిల్లాలో భూ పరిపాలన, ఆదాయ వనరుల నిర్వహణ, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజలకు అందించే రెవిన్యూ సేవలను పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేసేందుకు నావంతు కృషి చేస్తానని అన్నారు. జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని,ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించి, సేవలను సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తామని రెవిన్యూ అదనపు కలెక్టర్ తెలిపారు.